క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో శివయోగేంద్ర స్వామి



ఆశీర్వచనం స్వీకరిస్తున్న శివయోగేంద్రస్వామి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం నంద్యాల జిల్లా కాకనూర గ్రామంలో ని శారదాపీఠం స్వామీజీ శివయోగేంద్ర స్వామి దర్శించుకున్నారు. ఆలయంలో బేడా ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం అందజేశారు.

సందడిగా మరిడిమాంబ తీర్థం

సబ్బవరం: మండలంలోని గొటివాడ గ్రామంలో కొలువైన మరిడిమాంబ తీర్థమహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం నిర్వహించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోగ్రాం ఆకట్టుకుంది. అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఆలయ ధర్మకర్త విరోతి చిన అప్పలనాయుడు, వైస్ సర్పంచ్ గొలగాని దుర్గాప్రసాద్, వార్డు మెంబర్ లగిశెట్టి కుమార్, సచివాలయ కన్వీనర్ విరోతి రామారావు,వడిశల చంద్రరావు,చిట్టిబోయిన శంకర్,విశ్వనాథరాజు తదితరులు ఉన్నారు.

భారీ అన్నసమారాధన



వడ్డన చేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: జీవీఎంసీ 95వ వార్డు కృష్ణరాయపురంలోని విద్యాగణపతి ఆలయ 7వ వార్షికోత్సవాన్ని ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ కూడా అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అంగటి సూరిబాబు, ఉమా మహేష్, జగదీశ్‌రెడ్డి, వెంకునాయుడు, వేపాట శ్రీను పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

పరవాడ: పరవాడ–గాజువాక రహదారిలో స్థానిక బాలికల వసతి గృహం వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కె.రాంబాబు(35) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. స్థానిక జేఎస్ఎస్‌యూఆర్ఎం కాలనీలో నివాసం ఉంటున్న రాంబాబు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై పరవాడ నుంచి కాలనీకి వెళుతున్న క్రమంలో వాహనం అదుపు తప్పడంతో వసతి గృహం సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో రాంబాబు తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని యువకులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు.

కరాటే పోటీలు ప్రారంభం



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే బండారు

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామదేవత శ్రీ రామచంద్రమ్మ పండగ పురస్కరించుకుని నిర్వహిస్తున్న 13వ రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్–2023ను మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పరవాడ మాజీ ఎంపీపీలు మాదంశెట్టి నీలబాబు, మాసవరపు అప్పలనాయుడు, సర్పంచ్ శివలంక లక్ష్మి, నాయుడుపాలెం మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, మండల టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్న పాల్గొన్నారు.

రామచంద్రమ్మ.. చల్లగ చూడమ్మా

- రేపే అమ్మవారి పండగ
- 14 గ్రామాల ఆరాధ్య దేవత
- సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు పోటాపోటీగా ఏర్పాట్లు



దళాయిపాలెంలో కొలువుదీరిన శ్రీరామ చంద్రమ్మ అమ్మవారు



కొలువుదీరిన నాగదేవత



శ్రీరామచంద్రమ్మ ఆలయ ముఖద్వారం

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామ ప్రజల ఆరాధ్య దైవం రామచంద్రమ్మ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. రామచంద్రమ్మ అమ్మవారిని వాడచీపురుపల్లి వాసులతో పాటు 14 శివారు గ్రామాలకు చెందిన ప్రజలు భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. కోరిన కోర్కెలను నెరవేర్చే తల్లిగా అమ్మవారిని ఆరాధిస్తారు. అమ్మవారి పండగను మంగళవారం నిర్వహిస్తారు. రామచంద్రమ్మను దర్శించుకోవడానికి వాడచీపురుపల్లి పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు విశాఖ, అనకాపల్లి జిల్లాల నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

విస్తృత ఏర్పాట్లు

అమ్మవారి దర్శనం కోసం వేలాదిగా తరలివచ్చే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో షామియానాలు, ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేశారు. క్యూలైన్‌లో ఉన్న భక్తులకు ఉచితంగా తాగునీరు, మజ్జిగ అందజేయడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చాయి. వాడచీపురుపల్లిలో అమ్మవారి ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ తోరణాలతో అలంకరించారు. పురవీధులు విద్యుత్ తోరణాలతో కాంతులీనుతున్నాయి. నాలుగు చోట్ల భారీ సెట్టింగులు, ఆర్చ్‌లు వేశారు. ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి బాలనాగమ్మ పౌరాణిక నాటకం ఏర్పాటు చేశారు.

మంగళవారం రాత్రి నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు



వాడచీపురుపల్లిలో ఏర్పాటు చేసిన అమ్మవారి భారీ సెట్టింగ్

- ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సెంటర్ స్టేజి వద్ద రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా, డ్యాన్స్ హంగామా.
- మాసవరపు వారి వీధిలో విశాఖ థ్రిల్లర్స్ డి–10బాబి
- మాసవరపు అప్పారావు ఆధ్వర్యంలో ఏటీఎం ఎదురుగా డ్యాన్స్‌బేబీ డాన్స్.
- పెద్దింటి వారి వీధిలో మాస్టర్ రమేష్ ఈవెంట్స్ (పల్సర్ బైక్ ఝాన్సీ)
- అంబేడ్కర్ కాలనీలో డ్యాన్స్ మస్ట్, బీసీ కాలనీలో సినీ డూపర్స్ శాంతినికేతన్ కాన్వెంట్ వద్ద శంకర్ మాట్రిక్స్ డ్యాన్స్, లారీ, ట్రాక్టర్స్ యజమానుల ఆధ్వర్యంలో సినీ డూపర్స్, దళాయిపాలెంలో డ్యాన్స్ హంగామా నిర్వహించనున్నారు.
- చిన్నయ్య కాలనీలో స్పెషల్ ఎంటర్‌టైనర్స్, ఎన్టీఆర్ కాలనీలో నవరస హాస్య వల్లరి, గొరుసువానిపాలెంలో రేలారే రేలా, పోలిరెడ్డిపాలెంలో బుర్రకథ వంటి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. వాలీబాల్, చిడతలు పోటీలు ఏర్పాటు చేశారు. భారీ మందు గుండు ప్రదర్శనను ఏర్పాటు చేసినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ మాసవరపు అప్పలనాయుడు చెప్పారు.

హద్దు మీరితే చర్యలు



ఆలయ ప్రాంగణంలో సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ ఈశ్వరరావు

రామచంద్రమ్మ పండగలో కోడి పందాలు, పేకాట, బల్లాటలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ పి.ఈశ్వరరావు హెచ్చరించారు. అలాగే అశ్లీల ప్రదర్శనలకు అనుమతులు లేవన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. ఆదివారం ఉత్సవం జరిగే ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచలు చేశారు. ఆయన వెంట ఎస్ఐలు తేజేశ్వరరావు, మల్లేశ్వరరావు ఉన్నారు.

బాధిత విద్యార్థికి బాసటగా..



బాధితురాలు సరస్వతికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎన్ఆర్ఐ వెంకట రమణ తదితరులు



బాధితురాలి తల్లికి సాయం అందిస్తున్న యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు సాయినాథరావు

సబ్బవరం: ఇటీవల జరిగిన ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అంతకాపల్లి శివారు ఒమ్మివానిపాలేనికి చెందిన ఇంటర్ విద్యార్థి కోన సరస్వతికి టిక్కలిపాలెం గ్రామ సర్పంచ్ సత్యవమ్మ కుమారుడు, ఎన్ఆర్ఐ గొంప వెంకట రమణ రూ.40 వేలు అందించారు. రెండు కాళ్లు విరిగిపోయిన ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. సరస్వతి చదువుకు అయ్యే ఖర్చు తానే భరిస్తానని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఆయనతో పాటు వంగలి మాజీ ఎంపీటీసీ పైల వెంకట రమణ,టిక్కలిపాలెం మాజీ సర్పంచ్ పంచాడ శ్రీనివాస్,డి. చిన్నయ్య,కె. నారాయణ మూర్తి,బి. శ్రీను ఉన్నారు.

- ప్రమాదంలో గాయపడి రెండు కాళ్లు విరిగి మంచానికే పరిమితమైన కోన సరస్వతికి జిల్లా యాదవ సంఘం తరపున రూ.30 వేల ఆర్థిక సాయంతో పాటు నెల రోజులకు సరిపడే నిత్యావసర వస్తువులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు భర్జికాన సాయినాథరావు, సంఘం పెందుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు ఉప్పిలి కనక రాజు, సబ్బవరం మండల కార్యదర్శి పల్ల తాతారావు, కోరాడ శ్రీనివాసరావు,కోన సోమే శ్వరరావు,పల్ల కృష్ణ,పల్ల సన్యాసిరావు,పల్ల రమణ పాల్గొన్నారు.

ముగిసిన సీతారామాలయ వార్షికోత్సవాలు



సీతారాముల ఉత్సవమూర్తులు

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు సింహపురికాలనీ సీతారామాలయ 20వ వార్షికోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ధ్వజారోహణ, స్వామివారికి స్నపన తిరుమంజనం,చక్రస్నానం, పూర్ణాహుతి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం తీర్థమహోత్సవం సందడిగా జరిగింది. పద్మావతినగర్‌కు చెందిన సింహవల్లీ కోలాట బృందం చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. అలాగే సాయంత్రం శ్రీ పుష్పయాగం, ద్వాదశారాధన, ఊంజల్‌సేవ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు హరి ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటీ ప్రతినిధులు సీవీఆర్ మూర్తి, చలపతిరావు, అప్పలనాయుడు, రామారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అలాగే సోమవారం నుంచి ఈనెల 19వరకు ఉపాలయాల వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఓసీల సమస్యలపై సదస్సులు



సింహగిరిపై కరుణాకర్‌రెడ్డి దంపతులు

సింహాచలం: అగ్రవర్ణ పేదలకు 10 శాతం విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో చర్చించి ఏకాభిప్రాయం సాధించాలని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకరరెడ్డి డిమాండ్ చేశారు. వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం ఆయన సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని స్వామికి పూజలు నిర్వహించారు.అధికారులు స్వామి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు సమర్థించిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కొన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఓర్వలేనితనంతో వ్యతిరేకించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. నిరుపేద ఓసీల సమస్యలపై దేశవ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తామన్నారు.

విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న క్లబ్ అధ్యక్షుడు ఇసుకపల్లి వెంకటేశ్వరరావు

ఏయూ క్యాంపస్: నగరానికి చెందిన బ్లూస్టార్స్ స్పోర్ట్స్, కల్చరల్ క్లబ్ 12వ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏయూ క్రీడా విభాగ సంచాలకుడు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ మాట్లాడుతూ క్రీడల్లో యువతను భాగస్వాములను చేస్తూ బ్లూస్టార్స్ ఫుట్‌బాల్ క్లబ్ దశాబ్ద కాలంగా వందలాది మంది క్రీడాకారులను తీర్చిదిద్దిందని కొనియాడారు. క్లబ్ నిర్వాహకుడు, కోచ్ నరేష్ మాట్లాడుతూ గత 12 ఏళ్లగా 700 మంది వరకు యువతను ఫుట్‌బాల్ క్రీడాకారులుగా తీర్చిదిద్దామన్నారు. వీరిలో పది మంది వరకు జాతీయ స్థాయిలో రాణించారన్నారు. భవిష్యత్తులో మరింత మందిని అత్యుత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ విద్యతో సమానంగా యువత క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్లబ్ గౌరవ అధ్యక్షుడు ఇసుకపల్లి వెంకటేశ్వరరావు సంస్థ కార్యక్రమాలను తెలియజేశారు. ఈ సందర్భంగా క్లబ్ వివిధ పోటీలలో సాధించిన ట్రోఫీలు, పతకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మహనీయులు నడిచిన నేల విశాఖ నగరం

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ
- ముగిసిన సౌందర్యలహరి ప్రవచన మహోత్సవాలు



ప్రవచిస్తున్న షణ్ముఖశర్మ



పాల్గొన్న మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, తదితరులు

ఎంవీపీ కాలనీ: నేటి ఆధునిక ప్రపంచానికి ఆధ్యాత్మిక చైతన్యం కల్పించిన మహనీయుల నడిచిన నేల విశాఖపట్నమని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. వారం రోజులుగా ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని భద్రం పార్కులో నిర్వహిస్తున్న శ్రీశక్తి పంచాయతన యోగ పూర్వక శ్రీసౌందర్యలహరి ప్రవచన మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా షణ్ముఖశర్మ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చైతన్యాన్ని విశాఖ నుంచి సద్గురు శివానందమూర్తి, ఎక్కిరాల కృష్ణమాచార్య, శ్రీభాష్యం అప్పలచార్యులు వంటి మహనీయులు విశ్వవ్యాప్తం చేశారన్నారు. సుబ్రహ్మణ్యస్వామి పేరున వెలసిన మహా నగరంగా విశాఖపట్నం వర్ధిల్లుతోందని, దీనికి ఎంతో భవిష్యత్ ఉందని వెల్లడించారు. ప్రవచనాలు ముగిసిన అనంతరం షణ్ముఖశర్మను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎక్కిరాల అనంతకృష్ణ, మాజీ సీఎస్ ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్, కేవీఎస్ శ్యామ్, అరుణ దంపతులు, శ్రీహరి సేవా బృందం కో–ఆర్డినేటర్ సీహెచ్.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు. జీవీ సురేష్, పి.కామేశ్వరి బృందం ఆలపించిన భక్తి సంగీతం అందరినీ అలరించింది.

ఉచిత దంత వైద్య శిబిరానికి స్పందన



దంత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అగనంపూడి: ప్రతీ ఒక్కరూ దంతాలను పరిశుభ్రంగా ఉంచుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. 85వ వార్డు లంకెలపాలెం శివారు గంగిరెడ్లకాలనీ, ఎస్సీకాలనీల్లో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కింతాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాల సారథ్యంలో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూదంత సంబంధమైన రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకొని వాటిని సంరక్షించుకోవాలన్నారు. 170 మందికి దంత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, 79వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

వైభవంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలు



నిత్యకల్యాణంలో ఉత్సవమూర్తులకు తలబ్రాలు పోస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చనసేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేసి 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు

ఘనంగా నిత్యకల్యాణం : వరాహ లక్ష్మీనృసింహ స్వామికి ఆదివారం నిత్యకల్యాణం అట్టహాసంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకుడు పెదరాజు తదితరులు కల్యాణం నిర్వహించారు.

ఘనంగా శ్రీనృసింహ హోమం



నృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు



ప్రధాన కలశంతో ప్రదక్షిణ చేస్తున్న ప్రధానార్చకుడు రమణాచార్యులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజున సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఆదివారం స్వాతి నక్షత్రం కావడంతో ఉదయం 7 నుంచి ఆలయ కల్యాణ మండపంలో హోమం నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల మధ్య ఆలయంలోంచి ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొచ్చి అక్కడి హోమగుండం వద్ద అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం హోమం విశేషంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ భక్తిశ్రద్ధలతో చేశారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని ప్రధానర్చకుడు ఇరగవరపు రమణాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. తదుపరి ఆ జలాలను భక్తులపై చల్లారు. ఆలయ అర్చకులు శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో నరసింహరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వేడుకగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం



పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: జీవీఎంసీ 93వ వార్డు ప్రహ్లాదపురంలోని శ్రీ శారదాపీఠ పాలిత ఉమామహేశ్వస్వామివారి ఆలయ 15వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా పార్వతీపరమేశ్వరుల వార్షిక కల్యాణం కనులపండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. కల్యాణోత్సవంలో భాగంగా ఉదయం నుంచి విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం పార్వతీపరమేశ్వరులకు పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం, వినాయక పూజ, రక్షాబంధనం, అంకురార్పణ పూజలు చేశారు. సాయంత్రం 5గంటలకు ఉమా మహేశ్వరులకు తిరువీధి నిర్వహించారు. 93వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దాసరి రాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు. సోమవారం మధ్యాహ్నం అన్న సమారాధన పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్టు దాసరి రాజు తెలిపారు.

శ్రీకృష్ణ దేవరాయ కాపు సేవా సంఘం అధ్యక్షుడిగా ముమ్మన



సమావేశంలో మాట్లాడుతున్న ముమ్మన దేముడు

సింహాచలం: శ్రీ కృష్ణ దేవరాయ కాపు సేవా సంఘం అధ్యక్షుడిగా 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు ఎన్నికయ్యారు. చీమలాపల్లిలోని శ్రీకృష్ణ దేవరాయ కాపు సంక్షేమ కల్యాణమండంలో ఆదివారం కాపు సేవా సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముమ్మన దేముడును అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముమ్మన దేముడు మాట్లాడుతూ కాపుల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని, అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో పెందుర్తి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నక్క కనకరాజు, కాపు సామాజిక నేతలు గొరపల్లి అప్పారావు, బల్ల రాంబాబు, ముచ్చకర్ల దారప్ప, గండ్రెడ్డి రామునాయుడు, గండ్రెడ్డి సంజీవరావు, ముత్తా నాయుడు, సియాద్రి అప్పలరాజు, మెంటి మహేష్, రాపర్తి మాధవరావు, రాపర్తి రామశేషు, సుంకర త్రినాథ్, తామర్ల నర్సింగ్, గంట్ల నరసింహమూర్తి, అప్పికొండ రాంబాబు, గొరపల్లి శ్రీను, బొడ్డు సూర్యప్రకాష్, దూది వెంకటరమణ, చిక్కాల సతీష్ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ఉద్యమంపై డాక్యుమెంటరీ



మాట్లాడుతున్న కేకే రావు

కూర్మన్నపాలెం : ఉక్కు రిలే నిరాహారా దీక్షలు ప్రారంభమై రెండేళ్లు పూరైన సందర్భంగా విశాఖ ఉక్కు ప్రాముఖ్యతను, ఉద్యమ నేపథ్యాన్ని వివరిస్తూ విశాఖ ఉక్కు పేరుతో నిర్మించిన డాక్యుమెంటరీని వైజాగ్ యూట్యూబ్ చానల్‌లో కె.కె.రావు ఎక్స్ డైరెక్టర్ ఆపరేషన్స్ స్టీల్‌ప్లాంట్ దీక్షా శిబిరం వద్ద ఆదివారం విడుదల చేశారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న 731వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో డాక్యుమెంటరీ ఫిల్మ్ విడుదలను పురస్కరించుకుని ఉక్కు ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ప్రతినిధులు బోండా తవుడన్న, బాయ్యా మల్లయ్య, ఎల్‌వీ రమణ, ఎస్.సత్యనారాయణ, మాటూరి శ్రీనివాసరావు, ముప్పిడి రాజు, సత్యనారాయణ, బి.ఎస్.రెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కె.కె.రావు మాట్లాడుతూ కార్మికులను, ఉద్యమ స్ఫూర్తిని, రెండేళ్లలో కార్మికులు చేస్తున్న పోరాట ప్రతిమను కొనియాడారు. అనంతరం పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, అయోధ్య రామ్, వరసాల శ్రీనివాసరావు, కె.ఎస్.ఎన్.రావు, పరంధామయ్య, రమణారెడ్డి మాట్లాడుతూ త్యాగాలు, పోరాటాలు ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేస్తే సహించేదిలేదన్నారు. బీజేపీ మినహా అన్ని రాజకీయపార్టీలు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘీభావం తెలిపాయన్నారు. త్వరలోనే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకలు , ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.